క్లుప్తంగా

నేటి యువతకు స్ఫూర్తి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : భగత్ సింగ్ చూపిన తెగువ, పోరాటతత్వాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్ధన్ కోరారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని నిఫా యునైటెడ్ ఎన్జీఓ అసోసియేషన్, మీ కోసం సేవా సంస్థ, సఖి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఆంధ్ర ప్రదేశ్ గిరిజన బాలికోన్నత పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి శనివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటానికి ఊపిరిలూదిన భగత్ సింగ్ త్యాగం చిరస్మరణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సఖి ఫౌండేషన్ అధ్యక్షురాలు రహమతున్నిసా, సాయికిరణ్ రాజు, దీనా, వసంత, విజయకుమారి, సుధ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ భర్తపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ భర్త జయరామిరెడ్డిపై కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కడప ఆర్టీసీ బస్టాండు వద్ద ఓ దంతవైద్యురాలి పట్ల శంకరాపురానికి చెందిన జయరామిరెడ్డి అసభ్యంగా ప్రవర్తించాడు. వైద్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : క్రీడలతో దేశ దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని అనంతపురం జెఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరి జోజిరెడ్డి అన్నారు. కడప శివారులోని కేఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోజిరెడ్డి మాట్లాడుతూ జేఎన్‌టీయూ స్థాయిలో జరిగే ఈ పోటీల్లో రాణించి యూనివర్సిటీ జట్టులో స్థానం పొందాలని ఆకాంక్షించారు. కందుల విద్యా సంస్థల డైరెక్టర్ కందుల చంద్రఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఇండోర్ స్టేడియంలో వసతులను క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. ఈ కార్యక్రమంలో కేఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి.రత్నమ్మ, కేఎల్ఏం మహిళా ఇంజినీరింగ్ కళాశాల పీడీ గంగాదేవి, కేఎస్ఆర్ఎం పీడీ వంశీనాయక్, నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నాగార్జున విద్యార్థుల ప్రతిభ



వాలీబాల్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థులు

కడప స్పోర్ట్స్ : కడప వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ కడప నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని నాగార్జున మోడల్ స్కూల్ కరస్పాండెంట్ శివశంకర్‌రెడ్డి తెలిపారు. వాలీబాల్ అండర్-17 బాలుర విభాగంలో జె.నందన్, బాలికల విభాగంలో డి.గీతాంజలి, సి.దీప్తి, ఎస్.లక్ష్మిప్రియ, కె.సహస్ర, ఎస్.ధార్మికరెడ్డి, పి.నిహారిక, అండర్-14 బాలుర విభాగంలో బి.రామ్ చరణ్, పి.కమలేష్, కె.చరిత్ సాయిరెడ్డి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆయన అభినందించారు.

వృద్ధురాలికి అంతిమ సంస్కారం



మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకు వెళ్తున్న కాశీవిశ్వనాథ సేవా సమితి సభ్యులు

కడప అర్బన్ : అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధురాలికి మానవతా దృష్టితో అంత్యక్రియలు నిర్వహించారు. రవీంద్రనగర్‌కు చెందిన పులశివ శాంతి (70) అనే వృద్ధురాలు కడప నగర శివార్లలోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో ఉండేది. అనారోగ్యంతో ఆమె మృతి చెందింది. ఆమెకు కుమార్తెలు ఉన్నప్పటికీ అంత్యక్రియలకు సహకరించే బంధువులు లేకపోవడంతో కడప నగరంలోని శ్రీకాశీ విశ్వనాథ సేవాసమితి వారిని సంప్రదించారు. మానవత్వంతో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, పుట్ట పురుషోత్తం, దామోదర్, ట్రాఫిక్ కానిస్టేబుల్ దినేష్, రాజశేఖర్‌రెడ్డి, టైలర్ రవి, ఎలక్ట్రీషన్ మధు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

లడ్డూ నాటకం తప్ప బాబూ



కమలాపురం : వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చెన్నూరులో ఆలయంలో టెంకాయ కొడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకమైన, పవిత్రమైన శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డూ మీద అబండాలు వేసి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అప్రతిష్టపాలు చేయాలన్న ఒకే ఉద్ధేశ్యంతో చంద్రబాబు తన కపట నాటకాన్ని లడ్డూ రూపంలో బయటపెట్టారన్నారు. ఓ దేవదేవుడా వైకుంఠేశ్వరస్వామి చంద్రబాబునాయుడికి మంచి బుద్ధిని ప్రసాధించి ఆయన చేసిన పాపాల నుంచి ఆయనకు విముక్తిని కలిగించు స్వామి అంటూ పట్టణం, పల్లెల్లోని ప్రతి ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేడుకున్నారు.

కమలాపురం : హామీలు మరచి.. లడ్డూ నాటకం తెరమీదకు తేవడం తప్పు అని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో చంద్రబాబు చేసిన పాపాలు ప్రజలకు తగలకుండా ప్రత్యేక పూజలు జరిపారు. వారు మాట్లాడుతూ వంద రోజుల్లో సూపర్ సిక్స్ హామీలు నెరవేరుస్తామని చెప్పిన చంద్రబాబు టీం.. పింఛన్లు మినహా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వెళ్తున్న జగన్‌ను డిక్లరేషన్, తదితర ఆంక్షలు పెట్టి వెళ్లకుండా చేశారన్నారు. చంద్రబాబు చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మహ్మద్ సాదిక్, తదితరులు పాల్గొన్నారు. కాగా వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి ఎర్రగుడిపాడు గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : స్థానిక ప్రసన్న వెంకటేశ్వర స్వామి (కోట్ల స్వామి)ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మళ్ల సాయికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ సురేష్‌యాదవ్, సుబ్బారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మెడికల్ రవి, గుమ్మల శివారెడ్డి, వార్డు మెంబర్ మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మండల కన్వీనర్ రఘునాథరెడ్డి పాల్గొని మాట్లాడారు. చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని ప్రచారానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాఘవ యాదవ్, సంగమేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ శివాంజనేయరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : గంగనపల్లెలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.రమణారెడ్డి పాప ప్రక్షాళన పూజలు చేసి



వీరపునాయునిపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుల పూజలు



పెండ్లిమర్రి : గంగనపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

స్వచ్ఛతాహీ సేవపై చిత్రలేఖన పోటీలు

వైవీయూ : స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం పెయింటింగ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపల్ డా.వి.సలీం బాషా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.పి.శచీదేవి, డా.జి.విజయలక్ష్మిదేవి, వాలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన విద్యార్థి ప్రవేశ్ కార్యక్రమం..

కళాశాలలో 21 రోజుల పాటు నిర్వహించిన 'విద్యార్థి ప్రవేశ్' కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా, ఇంటాక్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ కళాశాల విద్యార్థినులు సమయపాలన, భాషా సామర్థ్యా లు, కోడింగ్ వంటి సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.జి.విజయలక్ష్మి, కృష్ణవేణి, ప్రకాష్ నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

ముగిసిన సాఫ్ట్‌స్కిల్స్ శిక్షణ

బెంగళూరుకు చెందిన యునెక్ట్ ఉన్నతి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కళాశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన లైఫ్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లీష్ శిక్షణ కోర్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా మాట్లాడుతూ డిగ్రీ ఫైనలియర్ కంప్యూటర్, సాఫ్ట్ స్కిల్స్‌లో నైపుణ్యం కనబరిచేలా విద్యార్థినులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. అనంతరం సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గురివిరెడ్డి, శిరీష, వరప్రసాద్, మంజుల, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏపీజీబీ పురోభివృద్ధికి తోడ్పాటునందిస్తాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : గ్రామీణ బ్యాంకుల్లో అగ్రగామిగా నిలుస్తున్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పురోభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందిస్తున్నామని ఏపీజీబీ చైర్మెన్ సత్యప్రకాశ్‌సింగ్ తెలిపారు. కడప జెడ్పీ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఏపీజీబీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగుల అసోసియేషన్‌కు సంబంధించి సొంత భవనాన్ని ప్రారంభించడం మరింత అభినందనీయమన్నారు. బ్యాంకు పురోభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తున్న తరుణంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం దృష్టి సారించాల్సి ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బిక్షమయ్య, జనరల్ సెక్రటరీ జగదీశ్వర్‌రెడ్డి, అధ్యక్షులు హరి ప్రసన్నకుమార్‌తోపాటు అసోసియేషన్ ఇతర నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ యువతకు ఆదర్శం

కడప ఎడ్యుకేషన్: బ్రిటీష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో భగత్ సింగ్ ఒక సింహస్వప్నమని, ఆయన ఆశయాల సాధనకు యువత కృషిచేయాలని పలువురు విద్యార్థి సంఘం నాయకులు పేర్కొన్నారు. భగత్ సింగ్ జయంతి కార్యక్రమాన్ని ఆయా విద్యార్థి సంఘాల కార్యాలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే భారత స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొని ఉద్యమాన్ని నడిపిన గొప్ప విప్లవకారుడు భగత్ సింగ్ అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్, పీఆర్ఎస్‌వై రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్, జిల్లా కన్వీనర్ ఒరగంటి నాగేంద్రబాబు, పీఎస్‌యూఆర్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి భాస్కర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం.ఓబులేసు, బ్లడ్ టు లివ్ ఫౌండర్ పట్టుపోగుల పవన్ కుమార్, ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ త్యాగం మరువలేనిది

కడప అగ్రికల్చర్ : స్వాతంత్ర పోరాటంలో భగత్‌సింగ్ త్యాగం మరువలేనిదని డీసీసీ బ్యాంకు ప్రత్యేక విధుల అధికారి గుర్రప్ప పేర్కొన్నారు. కడప డీసీసీ బ్యాంకులో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలు వేసి శనివారం బ్యాంకు సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం వీరబ్రహ్మం, మేనేజర్లు చంద్రశేఖర్, ఆంజనేయులు, నరసయ్య, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో భగతిసింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కడప ఉక్కు కోసం పోరాడదాం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భగత్ సింగ్ స్ఫూర్తితో కడప ఉక్కు కోసం పోరాడదామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి శనివారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, నాజర్, బాలాజీ, గణేష్, పవన్, ఆదాం, సయ్యద్, మౌలాలి, జనార్ధన్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర మాట్లాడుతూ బ్రిటీష్ వలసదారుల దోపిడీని పారదోలి భారతదేశాన్ని విముక్తి చేయడం కోసం ఉరికంబాలను చిరునవ్వుతో ముద్దాడిన విప్లవ ధ్రువతార భగత్‌సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, నగర అధ్యక్ష ,కార్యదర్శులు ఆకీరానంద్, బి.తేజ, చంద్ర, అరుణ్, శమంత, సల్మాన్, రాజేష్, అశోక్ రెడ్డి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో



నివాళులర్పిస్తున్న డీసీసీ బ్యాంకు సిబ్బంది



నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

సేవా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం



మొక్కలు నాటి, నీరు పోస్తున్న ఎన్ఎస్ఎస్ అధికారులు



మానవహారం నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

వైవీయూ : విద్యార్థులలో సామాజిక సేవా స్ఫూర్తి పెంపొందించడమే జాతీయ సేవా పథకం లక్ష్యమని వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి అన్నారు. వైవీయూలోని జాతీయ సేవా పథకం యూనిట్-3 వాలంటీర్లు వైవీయూ ఆవరణంలో శనివారం పరిసరాలు శుభ్రం చేసి మొక్కలు నాటారు. యూనిట్-9 వాలంటీర్లు కడప-పులివెందుల రోడ్డులో ముళ్ల కంపలు తొలగించి, 15 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. మానవహారంగా ఏర్పడి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పీఓలు డా.శ్రీధర్‌రెడ్డి, డా.కె.శ్రీనివాసరావు, ఆచార్య చంద్ర ఓబుళరెడ్డి, డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి, డాక్టర్ మీరావల్లి, వాలంటీర్లు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలో రోడ్లు, మురుగు కాల్వలు, తాగునీరు, వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. కడప నగరంలోని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆర్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సమస్యలను గుర్తించి కలెక్టర్, ఎమ్మెల్యే, నగరపాలక కమిషనర్ దృష్టికి, తీసుకుపోతామని తెలిపారు. పాత కడపలో దళితుల భూముల సమస్యను అధికారులకు విన్నవించినా నేటికీ పరిష్కారం కాలేదన్నారు. ప్రత్యక్ష పోరాటాల ద్వారా రానున్న రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కరించుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సిద్ధిరామయ్య, మక్బూల్ బాషా, ప్రసాద్, లక్ష్మీదేవి, చాపల సుబ్బరాయుడు, బాలచెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

మాకు న్యాయం చేయండి సారూ

కడప కోటిరెడ్డిసర్కిల్ : బ్యాక్‌లాగ్ ఉద్యోగాలకు 1994లో ఎంపికైన తమకు తగిన న్యాయం చేయాలని ఏపీ-1994 సెలెక్టెడ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ అభ్యర్థులు మూసా అలీబేగ్, చలపతి, మురళికృష్ణ, వీవీ.రమణ, వెంకటేశ్వర్లు, నరసింహులు కోరారు. విలేకరులతో వారు మాట్లాడుతూ తమకు శారీరక కొలతలు, ఫిజికల్ ఈవెంట్స్, రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక జాబితా తయారు చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో తమ జాబితాను ట్రెజరీలో పెట్టారని తెలిపారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం సంపూర్ణ మద్యపాన నిషేధం విధించడంతో నియామకాలు చేపట్టలేదన్నారు. న్యాయ స్థానాలు తమకు అనుకూల తీర్పునిచ్చినా ఉపాధి కల్పించలేదన్నారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న బాధిత అభ్యర్థులు

గుర్రం జాషువా జయంతి

కడప కల్చరల్ : వైవీయూలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గుర్రం జాషువా జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ఆచార్య జి.పార్వతి, జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'గుర్రం జాషువా జీవితం, సాహిత్యం.. సందేశం' అంశంపై చర్చ జరిగింది. చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ జాషువా రచించిన ఫిరదౌసి, గబ్బిలం కావ్యాలు సంచాలనాలు సృష్టించాయన్నారు. జాషువా కుమార్తె హేమలత మాట్లాడుతూ 'జాషువా ఫౌండేషన్' ద్వారా 'జాషువా సాహిత్య పురస్కారం' అందజేస్తున్నామన్నారు. ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ జాషువాను విశ్వ కవిగా చూడాలన్నారు. అనంతరం వక్తలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జి.హరిభూషణరావు, ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సుమతి, రాణి, గానుగపెంట హనుమంతరావు, జానమద్ది నాగరాజు, కుమారస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.



గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేవీవీ నాయకులు



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : నవయుగ కవి గుర్రం జాషువా అని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్‌భాషా అన్నారు. జేవీవీ, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువా రచించిన ప్రతి కావ్యాన్ని తరచి చూడాల్సిందేనన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమారస్వామి రెడ్డి మాట్లాడుతూ గుర్రం జాషువా సమాజాన్ని వెయ్యి అడుగుల ముందుకు తీసుకెళ్లాలని ప్రయత్నించారన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు అరుణ, రుతు ఆరోగ్య మేరి, పుష్పకుమారి, సునీత, వెంకటేశ్వర్లు, రమేష్, జాస్మిన్, శశిరేఖ, జ్యోతి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అందించడమే లక్ష్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి అన్నారు. కళాశాల సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో అధిక మార్కులు సాధించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి, క్యాంపస్ ఎంపికల్లో విజయం సాధించేందుకు నిష్ణాతులచే తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.



సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు